# మౌనమేల మంత్రిగారూ!?

- కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి అంటివి!
- 500 మీటర్ల నిబంధనపై మాట్లాడకపోతివి!
- 'ఎవరినీ వదిలిపెట్టబోం' అన్న హైడ్రా ఆ వైపు కన్నెత్తి చూడదేమంటూ ప్రశ్నలు
- బ్యాలెన్స్ చేసేందుకు ఇదే అవకాశమంటూ సీఎం రేవంత్‌రెడ్డికి జనం సూచనలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): 'కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి.. నాది, నా తమ్ముడి ఇంటి నిర్మాణం హిమాయత్‌సాగర్ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉంటే కూల్చుకోండి' అంటూ ఓపెన్ సవాల్ చేసి.. ఇప్పుడు మౌనం వహించారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి. 500 మీటర్ల నిబంధనపై 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించినా చడీచప్పుడు లేదు. ప్రస్తుతం ఉన్న గూగుల్ మ్యాప్‌లో చూస్తే నీటి నిల్వకు ఆయన ఇంటి నిర్మాణాలు చాలా దూరంగా ఉన్నాయి కదా అన్నట్టు కనిపిస్తుంది. పైగా 100 ఫీట్ల బఫర్‌జోన్ నిబంధన మాత్రమే ఉందనే అంచనాతో ఆయన ఆ వ్యాఖ్యలు చేసి ఉండొచ్చు. కానీ 2007లోనే పురపాలక శాఖ ఇచ్చిన అర కిలోమీటరు నిబంధన మెమోను 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెచ్చింది. 2012లో పురపాలక శాఖ భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన 168 జీవోను సైతం తెరపైకి తీసుకొచ్చింది. తాజాగా కొన్నేండ్ల కిందట మ్యాప్‌లను బేరీజు వేసి అసలు గుట్టురట్టు చేసింది. దీంతో మంత్రి పొంగులేటి సోదరుల నిర్మాణాలపై ప్రజల నుంచి ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. మరి వీటిపై సమాధానాలేవి?

- బఫర్‌జోన్ వరకు మాత్రమే నిర్మాణాలు నిషిద్ధం అని చర్చ జరుగుతున్న సందర్భంలో పొంగులేటి కొత్త టేపులు తెచ్చి కొలుచుకోండి.. కూల్చుకోండి అంటూ ఆఫర్ ఇచ్చారు. అంతకుమించి నిబంధనలు ఉన్నాయని వెలుగులోకి వచ్చిన తర్వాత ఎందుకు స్పందించటం లేదు?
- చెరువులకు బఫర్‌జోన్ వరకు నిబంధన ఉంటుంది. కానీ జంట జలాశయాల అంశం వేరు. దీనిపై సుప్రీంకోర్టు దాకా దశాబ్దాలపాటు విస్తృత చర్చ జరిగింది. అనేక నిపుణుల కమిటీలు అధ్యయనం చేశాయి. అనేక జీవోలు, మెమోలు జారీ అయ్యాయి. కేవలం బఫర్ జోన్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటే ఎట్ల? జంట జలాశయాలకు సంబంధించి గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే జారీ చేసిన ఉత్తర్వులను ఎందుకు విస్మరిస్తున్నారు?
- హైడ్రా తన పరిధి దాటి కూడా గండిపేట జలాశయం ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు కొన్నింటిని కూల్చివేసింది. మరి మిగతా వాటిని ఎందుకు వదిలిపెట్టినట్టు? నిబంధనల ప్రకారం తన నిర్మాణాలు లేనట్టయితే కూల్చుకోండి అని మంత్రి పొంగులేటి ఆఫర్ ఇచ్చినా హైడ్రా రంగంలోకి దిగేందుకు ఏ శక్తి అడ్డుకుంటున్నది?
- జలమండలి అధికారికంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, నిషిద్ధ జోన్లను ఎందుకు నిర్ధారించడం లేదు? నిజంగా మంత్రి పొంగులేటి నిర్మాణాలు ఆ పరిధిలోకి రానట్టయితే సర్వే చేసి నిర్ధారించి, బహిరంగ ప్రకటన చేయొచ్చు కదా?
- గీతానుసారమే హైడ్రా కూల్చివేతలని సెలవిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, తన మిత్రులకూ జంట జలాశయాల పరిధిల్లో ఫాంహౌస్‌లు ఉన్నాయని ప్రకటించారు. ఆ నిర్మాణాల నుంచి వచ్చే మురుగునీరు అందులో కలిస్తే.. ఆ నీటిని నగరవాసులకు తాగునీటిగా వినియోగించడం ఎంత వరకు భావ్యం? అని అభిప్రాయపడ్డారు. మరి పొంగులేటి నిర్మాణాలపై నిజాలను నిగ్గు తేల్చండని హైడ్రాను ఎందుకు ఆదేశించడం లేదు?
- సామాన్యుడికి ఓ న్యాయం? పెద్దోళ్లకు మరో న్యాయమా? అనే సూటి ప్రశ్నలు తెలంగాణ సమాజం నుంచి వస్తున్న నేపథ్యంలో రేవంత్ సర్కారు జంట జలాశయాల పరిధిల్లోని నిర్మాణాలపై సర్వే చేసి, శ్వేతపత్రం విడుదల చేస్తే రాష్ట్ర ప్రభుత్వ చిత్తశుద్ధి ప్రజలకు తెలుస్తుంది కదా?

## '500 మీటర్లు' ప్రశ్నపై నోరు మెదపరేం?

**కాంగ్రెస్** ప్రభుత్వం (2007లో) అధికారంలో ఉండగానే పురపాలక శాఖ ఇచ్చిన 500 మీటర్ల నిబంధన మెమోను ఈ నెల 25న 'నమస్తే తెలంగాణ' వెలుగులోకి తెస్తే.. ఇప్పటిదాకా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నోరు మెదపలేదు. 2012లో పురపాలక శాఖ భవన నిర్మాణ అనుమతుల 168 జీవోనూ 'నమస్తే తెలంగాణ' తెరపైకి తెచ్చింది. దీనిపైనా సీఎం సహా మంత్రులెవరూ కిమ్మనలేదు. మరి 500 మీటర్లలోపు నిర్మాణాలు సక్రమమా? అక్రమమా? ఆ ఇండ్లు బఫర్ జోన్‌లో ఉన్నట్టా? లేనట్టా? ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నట్టా? లేనట్టా? నిర్మాణాలు సక్రమమైతే సర్వే చేసి నిర్ధారించి, బహిరంగ ప్రకటన చేయొచ్చుగా? అక్రమమైతే హైడ్రా రంగంలోకి దిగదెందుకు?

రాయదుర్గంలో సోమవారం కూల్చివేతలకు ముందు.. తర్వాత

# పేదోళ్ల ఇండ్లపైకి బుల్డోజర్

- పోలీసు నీడలో కూల్చివేతలు
- తెల్లారేసరికే వచ్చిన అధికారులు
- నోటీసులు ఇవ్వకుండానే నేలమట్టం!
- రాయదుర్గంలో రోడ్డునపడ్డ బాధిత కుటుంబాలు
- మమ్మల్ని నిర్బంధించి ఇండ్లు కూల్చిండ్రు
- అనుమతులు, స్టే ఉన్నా కూలగొట్టిండ్రు : బాధితుల ఆవేదన
- యూనిటీ మాల్ కోసమే కూలదోశారని ఆరోపణ

కొండాపూర్, ఆగస్టు 26 : రాష్ట్రంలో బుల్డోజర్ పాలన కొనసాగుతున్నది. ఎన్నో ఏండ్లుగా నివాసముంటున్న పేదల ఇండ్లను సైతం బుల్డోజర్లతో కూలగొట్టడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. నోటీసులు ఇవ్వకుండా తెల్లారి ఏడుగంటలకే అధికారులు భారీగా పోలీసు బలగాలతో మోహరించి కోర్టు స్టే ఉన్న స్థలంలోనూ నివాసాలను కూలగొట్టడంతో ఆ కుటుంబాలు రోడ్డునపడ్డాయి. శేరిలింగంపల్లి మండలంలోని రాయదుర్గంలో సోమవారం జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్ఐఐసీ అధికారులు భారీ పోలీసు బందోబస్తు నడుమ మూడు నివాసాలు, ఐదు నిర్మాణాలు కూల్చివేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. ఇండ్లల్లో ఉన్న సామగ్రి అంతటినీ బయట పడేసి అధికారులు కూల్చివేతలకు పాల్పడ్డారు. తమను నిర్బంధించి మరీ ఇండ్లను కూల్చివేశారని బాధితులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. 'మా తాత ముత్తాతల నుంచి ఈ ఇండ్లల్లోనే ఉంటున్నం.. ఏటా జీహెచ్‌ఎంసీకి ఆస్తి పన్ను చెల్లిస్తున్నం.. కరెంటు బిల్లులు కడుతున్నం.. ఈ భూమికి సంబంధించి కోర్టు స్టే కూడా ఇచ్చింది. సోమవారం కోర్టులకు సెలవు ఉండటంతో ఇదే అదునుగా పోలీసులు మమ్మల్ని చుట్టుముట్టి బుల్డోజర్లతో తమ ఇండ్లను కూలగొట్టిండ్రు. పిల్లలున్నరు.. ఆరోగ్యం బాగలేనోళ్లున్నరు. ఏమాత్రం సోయి లేకుండా అధికారులు రాక్షసుల్లా వచ్చి తమ ఇండ్ల మీద పడి కూల్చిండ్రు. ఇప్పుడు తాము ఏడుండాలె?' అంటూ బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

### అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు

**మా** ముత్తాతలు హైదరాబాద్ టెన్నరీస్ సంస్థను స్థాపించినప్పటికే 37.08 ఎకరాల భూమి ఉన్నది. కానీ అధికారులు స్థలమంతా లిడ్‌క్యాప్‌దంటూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నరు. లిడ్‌క్యాప్ సంస్థకు కేవలం 5 ఎకరాల స్థలం మాత్రమే ఉన్నది. మా భూములను అన్యాయంగా, దౌర్జన్యంగా లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇంట్లో పిల్లలు, పెద్ద వయస్సు వారున్నారన్న కనీస జ్ఞానం లేకుండా ఉదయం 7 గంటలకే వచ్చి ఇండ్లు కూల్చివేశారు. ఇప్పుడు మా కుటుంబాలు ఎక్కడికి పోవాలి? ఉదయం నుంచి రోడ్డుపై పడిగాపులు కాస్తున్నం. ప్రజాపాలనలో అధికారులు రాక్షసుల్లా ప్రవర్తిస్తున్నరు.

– నసిర్ అలీఖాన్, బాధితుడు

### ప్రజా పాలనంటే ఇదేనా?

**ఈ** భూములపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. కూల్చివేతలు చేపట్ట వద్దని స్టేటస్ కోలు ఉన్నాయి. అయినా అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా, ఇంట్లో చిన్న పిల్లలు, పెద్దలు ఉన్నారన్న కనీస సోయి లేకుండా కూల్చివేశారు. హృద్రోగ సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మా కుటుంబ సభ్యులు ఎక్కడికి వెళ్లాలో అర్థంకాని పరిస్థితి తెచ్చారు. రేవంత్‌రెడ్డి చెబుతున్న ప్రజాపాలన అంటే ఇదేనా?

– ముఖ్తార్ అలీఖాన్, బాధితుడు

కాగా ఇవి లిడ్‌క్యాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట కార్పొరేషన్)కు చెందిన భూములుగా అధికారులు వాదిస్తున్నారు. ఈ క్రమంలో భూములపై హైకోర్టులో కేసు కొనసాగుతున్నది. ఈ క్రమంలో సోమవారం తెల్లారుజామున ఐదు గంటలకు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్ఐఐసీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇండ్లు కూల్చివేస్తామని సమాచారం ఇచ్చి ఉదయం ఏడు గంటల్లోపు వందమంది పోలీసు బలగాలు, బుల్డోజర్లు అక్కడికి చేరుకున్నాయి. ఈలోగా కొంతమేర సామగ్రిని వారంతా తీసుకొని బయటికి వచ్చారు. ఏడు గంటల ప్రాంతంలో కూల్చివేతలు మొదలు కావడంతో బాధితులు లబోదిబోమని అడ్డుకునే ప్రయత్నంచేశారు. పోలీసులు తమను పక్కకు తీసుకెళ్లి, కదలకుండా చుట్టూ మోహరించినట్టు బాధితులు తెలిపారు. గంట వ్యవధిలోనే మూడు ఇండ్లతోపాటు సమీపంలోని ఐదు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

### గంట వ్యవధిలోనే నేలమట్టం

రాయదుర్గం 1 నుంచి 41 వరకు ఉన్న సర్వే నంబర్లలో 37.08 ఎకరాల భూమి ఉన్నది. ఇది హైదరాబాద్ టెన్నరీస్‌కు చెందినదని, దాని పూర్తి హక్కులు తమకు వంశపారంపర్యంగా వస్తున్నాయని కొన్ని కుటుంబాలు ఇక్కడ ఇండ్లు కట్టుకొని ఉంటున్నాయి. కాగా ఇవి లిడ్‌క్యాప్ (లెదర్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట కార్పొరేషన్)కు చెందిన భూములుగా అధికారులు వాదిస్తున్నారు. ఈ క్రమంలో భూములపై హైకోర్టులో కేసు కొనసాగుతున్నది. ఈ క్రమంలో సోమవారం తెల్లారుజామున ఐదు గంటలకు జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ, లిడ్‌క్యాప్, టీఎస్ఐఐసీ అధికారులు అక్కడికి చేరుకున్నారు. ఇండ్లు కూల్చివేస్తామని సమాచారం ఇచ్చి ఉదయం ఏడు గంటల్లోపు వందమంది పోలీసు బలగాలు, బుల్డోజర్లు అక్కడికి చేరుకున్నాయి. ఈలోగా కొంతమేర సామగ్రిని వారంతా తీసుకొని బయటికి వచ్చారు. ఏడు గంటల ప్రాంతంలో కూల్చివేతలు మొదలు కావడంతో బాధితులు లబోదిబోమని అడ్డుకునే ప్రయత్నంచేశారు. పోలీసులు తమను పక్కకు తీసుకెళ్లి, కదలకుండా చుట్టూ మోహరించినట్టు బాధితులు తెలిపారు. గంట వ్యవధిలోనే మూడు ఇండ్లతోపాటు సమీపంలోని ఐదు నిర్మాణాలను నేలమట్టం చేశారు.

### యూనిటీ మాల్ కోసమే?

1942లో తమ పూర్వీకులు హైదరాబాద్ టెన్నరీస్ సంస్థను ఏర్పాటు చేసి అక్కడే నివాసం ఉన్నారని, ప్రస్తుతం అధికారులు కూల్చివేసిన ఇండ్లకు సైతం ఇంటి నంబర్లతోపాటు కరెంటు బిల్లులు, పన్నులను రెగ్యులర్‌గా జీహెచ్‌ఎంసీకి చెల్లిస్తున్నామని బాధితులు తెలిపారు. హైకోర్టు ఇచ్చిన స్టేటస్‌కోను పరిగణనలోకి తీసుకోకుండా కూల్చివేయడం రాక్షస పాలనకు నిదర్శనమంటూ ఆవేదన వ్యక్తంచేశారు. లిడ్‌క్యాప్ ఆధ్వర్యంలో యూనిటీ మాల్ నిర్మాణం కోసం కేంద్రం నుంచి రూ.500 కోట్లు వచ్చాయని, తమకు భూములు అప్పగించాలంటూ బసిరత్ అలీఖాన్ కుటుంబంపై లిడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్ నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్‌రంజన్ ఒత్తిడి చేసినట్టు, లిడ్‌క్యాప్ జీఎం వేణుమాధవ్ ద్వారా చర్చలకు పిలిచినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. సదరు స్థలం తమ కుటుంబానికి చెందినదని, ఏవైనా సమస్యలుంటే కోర్టు ద్వారా తేల్చుకోవాలని లిడ్‌క్యాప్ యాజమాన్యానికి తెలిపామని చెప్పారు. 'మీ కుటుంబాన్ని రోడ్డుపైకి లాగి ఆ భూమిని మా ఆధీనంలోకి తీసుకుంటం' అంటూ లిడ్‌క్యాప్ యాజమాన్యం బెదిరించినట్టు బాధితులు వాపోతున్నారు.

### మా తప్పంటే భూమినే అప్పగిస్తం

సర్వే నంబర్ 1 నుంచి 41వరకు ఉన్న 37.08 ఎకరాల భూమి మా తాతల ఆస్తి. అది పక్కా ప్రైవేట్ భూమి. లిడ్‌క్యాప్ సంస్థతో ఏర్పడిన వివాదంతో ఇప్పటికే ఆ భూమిపై హైకోర్టులో కేసు నడుస్తున్నది. గతంలో స్థల వివాదం విషయంలో మేం కోర్టును ఆశ్రయించాం. లిడ్‌క్యాప్ ఎండీ శ్రీనివాస్ నాయక్, ప్రిన్సిపల్ సెక్రటరీ జయేశ్ రంజన్ ఈ భూమి కోసం ఎంతో ఒత్తిడి చేస్తున్నారు. మాకు రూ.50 కోట్లు, ఎకరం స్థలం ఇస్తామంటూ ఆఫర్లు ఇచ్చారు. మా వైపు న్యాయం ఉన్నది. కోర్టులో కేసు గెలిస్తే మా భూమి మాకు వస్తుంది. కేసు ఓడితే భూమిని ప్రభుత్వానికి అప్పగిస్తాం. అంతేగానీ డబ్బులకు అమ్ముడుపోమని గతంలోనే చెప్పినం.

– బసిరత్ అలీఖాన్, బాధితుడు

## సలకం చెరువులో కబ్జాలు కూల్చే దమ్ముందా?

### ప్రభుత్వానికి బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): హైడ్రా పేరుతో హడావుడి చేస్తున్న ప్రభుత్వానికి సలకం చెరువులో ఉన్న ఒవైసీ భూములను కూల్చే దమ్ముందా? అని బీజేపీఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి సవాల్ విసిరారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. కబ్జాలను కప్పిపుచ్చుకోవడానికి ఒవైసీ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మండిపడ్డారు. నిజంగా ప్రజాప్రతినిధివే అయితే స్వచ్ఛందంగా కట్టడాలను కూల్చేయాలని డిమాండ్ చేశారు. సలకం చెరువులోని ఆక్రమణలు హైడ్రా కమిషనర్‌కు కనిపించకుంటే తానే వచ్చి చూపిస్తానని చెప్పారు. హామీలను నెరవేర్చలేకనే ప్రభుత్వం హైడ్రాను తెర మీదకి తెచ్చిందని విమర్శించారు. దమ్ముంటే పాతబస్తీలో గుర్రం చెరువు, జల్‌పల్లి చెరువులోనూ అక్రమ నిర్మాణాలు ఉన్నాయని, వాటన్నింటినీ కూల్చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్యాక్రాంతం అయిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. దేవాదాయ శాఖ భూముల్లోని ఆక్రమణలపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## నన్ను కాల్చండి.. కాలేజీని కూల్చొద్దు: ఒవైసీ

హైదరాబాద్ సిటీబ్యూరో, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ): సకలం చెరువులో ఉన్న ఒవైసీ విద్యాసంస్థలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న పోస్టులపై ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ సోమవారం స్పందించారు. ట్యాంక్‌బండ్ బఫర్ జోన్‌లో ఉన్న నెక్లెస్‌రోడ్‌ని కూడా కూల్చివేస్తారా అని నిలదీశారు. తనపై మళ్లీ బుల్లెట్ల వర్షం కురిపించుకోవచ్చని, ఒవైసీ విద్యాసంస్థను మాత్రం కూల్చవద్దని అన్నారు. పేదలకు ఉచితవిద్యను అందించేందుకు 12 భవనాలను నిర్మించానని, వీటిని ఉద్దేశపూర్వకంగా కొందరు తప్పుగా చూపిస్తున్నారని తెలిపారు. గతంలో తనపై కాల్పులు జరిగాయని, కావాలంటూ మళ్లీ కత్తులతో దాడి చేసుకోవచ్చని, కానీ పేదల విద్యాభివృద్ధికి చేస్తున్న కృషికి అడ్డుపడొద్దని అక్బరుద్దీన్ ఒవైసీ వ్యాఖ్యానించారు.

# డబ్బుల డైవర్షన్?

మొదటిపేజీ తరువాయి...

విశ్లేషకులు అనుమానిస్తున్నారు.. అదే 'మహారాష్ట్ర ఎన్నికలు'! త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. హర్యానా, కశ్మీర్ తర్వాత నవంబర్‌లో మహారాష్ట్ర ఎన్నికలు జరగవచ్చని భావిస్తున్నారు. ఈ దశలో మహారాష్ట్రలో గెలుపు కాంగ్రెస్ అధినాయకత్వానికి అత్యవసరం. అందుకు ఆ పార్టీకి భారీ ఫండింగ్ అవసరం. ప్రస్తుతం రెండు పెద్ద రాష్ట్రాల్లోనే కాంగ్రెస్ అధికారంలో ఉన్నది. ఒకటి కర్ణాటక కాగా.. మరొకటి తెలంగాణ. రెండూ ఆర్థికంగా, రాజకీయంగా బలమైనవి. పాలనాపరంగా కర్ణాటకలో ఇప్పటికే దివాలా పరిస్థితులు కనిపిస్తున్నాయి. వరుసగా వెలుగుచూస్తున్న కుంభకోణాలు, చార్జీల మోత, పెరుగుతున్న ప్రజావ్యతిరేకత, అవినీతిలో ఆరోపణల్లో పీకల్లోతు కూరుకుపోయిన సీఎం సిద్ధరామయ్య! ముఖ్యమంత్రి ఎప్పుడు మారుతారో తెలియని సందిగ్ధస్థితి! దీంతో కర్ణాటక నుంచి నిధుల సమీకరణ సాధ్యమయ్యేలా కాంగ్రెస్ అధిష్ఠానానికి కనిపించడంలేదని ఆ పార్టీ వర్గాలే చెప్తున్నాయి. ఈ క్రమంలో మహారాష్ట్రలో కాంగ్రెస్ ఎన్నికల ఖర్చును భరించాల్సిన భారమంతా తెలంగాణపైనే పడిందని అవిభావిస్తున్నాయి. ఈ మేరకు పార్టీ ఫండ్‌కు సంబంధించి కాంగ్రెస్ అధిష్ఠానం రాష్ట్ర నాయకత్వానికి భారీ టార్గెట్‌ను ఇవ్వడంతో పాటు.. సమకూర్చాల్సిందిగా ఒత్తిడి చేస్తున్నదని పార్టీవర్గాలే చర్చించుకుంటున్నాయి.

### ప్రముఖులపై ఒత్తిడి!

తెలంగాణలోనూ పరిస్థితి అనుకున్నంత ఆశాజనకంగా ఏమీ లేదు. రియల్‌ఎస్టేట్ రంగం పడిపోయింది. దాని అనుబంధ రంగాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. నగదు చెలామణి తగ్గిపోయింది. పారిశ్రామిక రంగాల్లో నిస్తేజం అలుముకున్నది. దీంతో ఆర్థిక వనరులను సమకూర్చుకునే అనివార్యమైన పరిస్థితుల్లో రాష్ట్ర నాయకత్వం అక్రమ కట్టడాల కూల్చివేతకు తెరలేపిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలో తమకు భారీగా సపోర్ట్ చేయాల్సిందిగా ఒకరిద్దరు ప్రముఖులపై నాయకులు ఒత్తిడి తెచ్చారని.. వారు కాదనడంతోనే కూల్చివేతల అంకానికి సిద్ధమయ్యారని నేతల చర్చల్లో వినిపిస్తున్న మాట. ఒకరిద్దరు గట్టోళ్లను కొడితేనే మిగిలిన పని సునాయాసంగా అయిపోతుందని ఈ నిర్ణయానికి వచ్చినట్టు వారు చెప్తున్నారు. ఇందుకోసం డబ్బు, పలుకుబడి ఉన్న వ్యక్తులు, విపక్ష ప్రముఖులు, సెలబ్రిటీలు, పారిశ్రామికవేత్తలను టార్గెట్ చేశారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

### స్వామికార్యం.. స్వకార్యం!

స్వామికార్యంతోపాటు స్వకార్యం కూడా సాధించుకునేందుకు కూల్చివేతలను ఎంచుకున్నట్టు అధికారపార్టీలోని కొందరు నేతలు మాట్లాడుకుంటున్నారు. 'పార్టీలో తనకు ప్రత్యర్థులుగా ఉన్న నాయకులను లక్ష్యం చేసుకోవడానికే ఈ కూల్చివేతలను ఓ ముఖ్యనేత వాడుకుంటున్నారు. పార్టీలో తానే సుప్రీం అని, తనను కాదని ఎవరూ ఏమీ చేయలేరనే సంకేతాలు ఇవ్వడమే ఆయన ఉద్దేశం. ఆర్థిక వనరుల సమీకరణ తనతోమాత్రమే సాధ్యమని అటు అధిష్ఠానానికి తెలియజెప్పడంతోపాటు.. కూల్చివేతల బూచి చూపి అక్రమ నిర్మాణాలు కలిగిన పార్టీలోని తన ప్రత్యర్థులకు గట్టి హెచ్చరికలు పంపడం ఆ వ్యూహంలో భాగమే' అని కాంగ్రెస్ పరిణామాలను దగ్గరినుంచి గమనించే సీనియర్ రాజకీయ విశ్లేషకుడు ఒకరు చెప్పారు. హైడ్రా వ్యవహారంలో టార్గెట్ అయిన నేతల్లో ఒకరు పొంగులేటి కాగా, మరొకరు వివేక్! ఇద్దరూ ఆర్థికంగా బలవంతులు కావడం, ఢిల్లీ నాయకత్వాన్ని ప్రభావితం చేయగలిగి ఉండటంతో వారిని అక్రమ నిర్మాణాల వివాదంలోకి లాగి ఉంటారన్నది సదరు విశ్లేషకుడి మాట.

### అనుకూలమైన అధికారులకు చోటు!

హైడ్రా రాత్రికిరాత్రి వచ్చింది కాదని, కొంతకాలంగా దానికి రంగం సిద్ధంచేశారని స్వతంత్ర జర్నలిస్టు ఒకరు వ్యాఖ్యానించారు. 'రంగారెడ్డి, మెదక్, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో తనకు విశ్వసనీయులైన, తన మాట చెల్లుబాటు చేసే అధికారులను ముఖ్యనేత ఒకరు కొంతకాలంగా నియమిస్తూ వచ్చారు. కూల్చివేతల పర్వం మొదలైతే.. అది తన అదుపాజ్ఞల్లో అధికారులు నడుపాలన్నది ఆయన ఉద్దేశం కావచ్చు' అని ఆ పాత్రికేయుడు పేర్కొన్నారు.

### అప్పులపై బీద అరుపులు అందుకేనా?

'కేంద్రంలో అధికారం లేనప్పుడు.. అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో తమ ప్రభుత్వాల నుంచి కాంగ్రెస్ అధిష్ఠానం ఏం ఆశిస్తుందో అందరికీ తెలుసు. ఈ విషయంపై పూర్తి అవగాహన ఉన్నది కనుకే రాష్ట్ర కాంగ్రెస్ బాధ్యులు తెలంగాణ అప్పుల్లో ఉన్నదని పదే పదే మాట్లాడారు. రాష్ట్రం పరువు పోయినా సరే.. అన్న రీతిలో వాళ్ల వ్యాఖ్యానాలు సాగాయి. నిజానికి వాళ్ల ఉద్దేశం తెలంగాణ అప్పుల్లో ఉన్నదని చాటిచెప్పడం కాదు.. కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణపై పెట్టుకున్న అంచనాలను తగ్గించడం. అంత ఇచ్చుకోలేమని చెప్పుకోవడం. కానీ కాంగ్రెస్ అధిష్ఠానం వీటిని పట్టించుకునే పరిస్థితి లేదు. ఆర్థిక వనరుల సమీకరణకు తెలంగాణ తప్ప దానికి మరో దారి లేదు' అని కాంగ్రెస్‌లోని ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించడం గమనార్హం.

# అడ్డొస్తే బుల్డోజర్లు ఎక్కించండి

- ప్రభుత్వ భూములు చెరపట్టిన వారిని ఉపేక్షించొద్దు
- జెండారంగులతో సంబంధం లేకుండా కూల్చేయండి
- పెద్దలను వదిలి పేదల నిర్మాణాలను కూల్చితే ఊరుకోం
- మెదక్ ఎంపీ రఘునందన్‌రావు

మొయినాబాద్, ఆగస్టు 26: జెండా రంగులతో సంబంధంలేకుండా ప్రభుత్వ భూములను కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను కూల్చివేయాలని.. ఎవరైనా అడ్డొస్తే బుల్డోజర్లు వారిపైకి ఎక్కించాలని మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. వచ్చే నెల ఒకటి నుంచి 15వరకు నిర్వహించనున్న బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సోమవారం రంగారెడ్డి జిల్లాలోని మొయినాబాద్ మండలంలోని చాందినీ గార్డెన్‌లో జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా మెదక్, చేవెళ్ల ఎంపీలు రఘునందన్‌రావు, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ.. పెద్దలను వదిలి పేదల నిర్మాణాలను హైడ్రా కూల్చివేస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను చెరపట్టిన వారు ఎంతటివారైనా ఉపేక్షించొద్దని.. అందుకు బీజేపీ సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. హైడ్రాను పనుల్లో రాజకీయ నాయకులు, వీఐపీలు జోక్యం చేసుకోవద్దని, ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్రభుత్వ భవనాలు ఉన్నా కూల్చివేయాలని చెప్పారు. ప్రభుత్వం కూల్చివేతలపై దృష్టి పెట్టి ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేసిందని విమర్శించారు. దవాఖానల్లో మంచాల్లేక.. మందుల్లేక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆరోపించారు.

### అధికారులపైనా చర్యలు తీసుకోండి : ఎంపీ కొండా

ఎఫ్‌టీఎల్‌ను కబ్జాలను కూల్చివేయడంతో పాటు, నిర్మాణాలకు అనుమతులిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అక్రమ భవనాలను కొందరు విక్రయించి వెళ్లిపోయారని.. వాటిని కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలకు నష్టపరిహారాన్ని ఇప్పించే బాధ్యతను కూడా హైడ్రా తీసుకోవాలని కోరారు. పేదలకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## పులిపై రేవంత్ స్వారీ

### రాజకీయాలకతీతంగా 'హైడ్రా' పనిచేయాలి: సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : హైడ్రా చర్యలతో బడాబాబులు జైలుకు వెళ్లాల్సి వస్తుందో? లేదో? గానీ వారి ఒత్తిడితో రేవంత్‌రెడ్డే జైలుకు వెళ్లే ప్రమాదం ఉన్నదని, రేవంత్‌రెడ్డి పులి మీద స్వారీ చేస్తున్నాడని, మధ్యలో ఆపేస్తే ఆ పులే తినేస్తుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ హెచ్చరించారు. హైదరాబాద్‌లోని మగ్దుం భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆక్రమణల కూల్చివేత విషయంలో రాజకీయాలకు అతీతంగా హైడ్రా పనిచేయాలని సూచించారు. నోటరీ ద్వారా కొందరు ప్రభుత్వ భూమి అమ్మకాలు చేపట్టారని, వీటి విషయంలో పేదలకు నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఎన్ కన్వెన్షన్‌ను ఎఫ్‌టీఎల్‌లోనే నిర్మించారని, ఈ విషయంలో నాగార్జున నుంచి డబ్బులు వసూలు చేసి చెరువును నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యాలయాలను కూల్చే విషయంపై రేవంత్‌రెడ్డి అఖిల పక్ష సమావేశం పెట్టాలని సూచించారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ నిర్మాణాలతో పోల్చడం సరికాదని చెప్పారు.

# హైడర్..బాద్!

మొదటిపేజీ తరువాయి...